సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
సోమవారం । 15 । జనవరి । 2024



ఇల వైకుంఠం బల్లిగిరి
విశాఖ: బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధనర్మాస ఉత్సవాల్లో భాగంగా అల వైకుంఠాన్ని తలపించింది. IIలో



అలరించిన నృత్య ప్రదర్శనలు
విశాఖ: సంక్రాంతి సంబరాల్లో భాగంగా మధురవాడ శిల్పారామం జాతరలో శాస్త్రీయ, జానపద నృత్యాలు అలరించాయి.



వేడుకగా పతంగుల పండగ
అనకాపల్లిలో పతంగుల పండగలో భాగంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముఖచిత్రంతో కూడిన గాలిపటాలను ఎగురవేశారు.

న్యూస్‌రీల్

మద్యం మత్తులో యువకుడు హల్‌చల్
- కత్తితో వ్యక్తిపై దాడి
- అదుపులోకి తీసుకున్న పోలీసులు



హల్‌చల్ చేస్తున్న యువకుడిని పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్న పోలీసులు

హుకుంపేట: మండల కేంద్రం హుకుంపేటలో మద్యం మత్తులో ఓ యువకుడు కత్తి పట్టుకుని హల్‌చల్ చేశాడు. ఆదివారం వాహనచోడకులపై దాడి చేస్తూ అలజడి సృష్టించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మద్యం దుకాణం వద్ద పాడేరుకు చెందిన బాబి అనే వ్యక్తిని గాయపరిచాడు. పట్టుకుంటే నరికేస్తానని బెదిరించడంతో అతని వద్దకు వెళ్లేందుకు ఎవ్వరూ సాహసించలేదు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ సతీష్ బలగాలతో అతని వద్దకు వెళ్లారు. అతనిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. గాయపడిన వ్యక్తిని పోలీసులు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వీరంగం సృష్టించిన యువకుడు ములియపుట్టు గ్రామానికి చెందిన శ్రీకాంత్‌గా స్థానికులు తెలిపారు.

విశేషంగా ధారోత్సవాలు



ఉత్సవమూర్తులను ఆలయంలోకి తీసుకెళ్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై నాలుగోరోజు ఆదివారం ధారోత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఒక పల్లకీలో, మరో పల్లకీలో సువర్ణ అమ్మవారిని, చతుర్భుజ తాయారు అమ్మవారిని, గోదాదేవి అమ్మవారిని తిరువీధిగా గంగధార వద్దకు తీసుకెళ్లారు. అక్కడ వేదికపై అమ్మవార్లను అధిష్ఠింపజేసి పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం గంగధార వద్ద ఉన్న పురాతన మండపంలో స్వామిని, అమ్మవార్లను అధిష్ఠింపజేశారు. పాశుర విన్నపం పారాయణ చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకటాద్రి అభివృద్ధికి సహకారం
- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెందుర్తి: విశాఖ తిరుమలగా పేరుగాంచిన వెంకటాద్రి అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. భక్తులకు వెంకటాద్రిపై అన్ని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. వెంకటాద్రిపై దేవదాయశాఖ నిధులు రూ.కోటితో ఏర్పాటు చేయనున్న పుష్కరిణి పనులకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చేతుల మీదుగా ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాద్రి అభివృద్ధికి జీవీఎంసీ నుంచి ఇటీవల కాలంలో అనేక నిధులు కేటాయించిందన్నారు. ముందుగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో నీలిమ, ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, వెంకటాద్రి ప్రతినిధులు, సేవకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శారదాపీఠంలో ఘనంగా భోగి



శిష్యపరివారంతో భోగిమంట కాస్తున్న స్వామీజీలు

పెందుర్తి: చినముషిడివాడలోని శ్రీశారదాపీఠంలో భోగి సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ పుణ్యస్నానం ఆచరించి భోగి మంట కాసారు. అనంతరం పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తులకు స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీతో విశేష పూజలు జరిపారు.శిష్యపరివారం, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పండగ వేళ.. స్వగృహానందం

సంక్రాంతి పండగవేళ పేదల్లో స్వగృహానందం నెలకొంది. సొంతిళ్లులేని వీరికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 17,111 ఇళ్లను మంజూరు చేయగా వీటిలో 986 మంది నిర్మాణాలు పూర్తి చేశారు. నూతన గృహాల్లో సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకుంటున్నారు. మిగతా లబ్ధిదారులు కూడా సొంతింటి కళను సాకారం చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

- జిల్లాలో 17,111 మందికి కాలనీ ఇళ్లు మంజూరు
- ఇప్పటికే 986 నిర్మాణాలు పూర్తి
- మిగతా చోట్ల పనులు వేగవంతం
- మార్చి నెలాఖరుకు పూర్తిచేసే లక్ష్యంతో అధికారులు



జి.మాడుగుల మండలం పాలమామిడిలో పాంగి కుమారి నిర్మించుకున్న పక్కా గృహం

సాక్షి, పాడేరు: జిల్లాలో ఇళ్లు లేని పేదలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలుజేస్తున్న పీఎంఏవై–వైఎస్సార్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం వరంలా మారింది. గతేడాది జిల్లాలోని 22 మండలాల్లో ప్రభుత్వం 17,111 పక్కా గృహాలను మంజూరు చేసింది. వీరిలో 1328 మంది గిరిజనులు వివిధ కారణాలతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. మిగతా 15,783 మందిలో 986 మంది పూర్తి చేశారు. మిగతా 14,791 మంది చేపట్టిన ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని ఈ ఏడాది మార్చి లోగా పూర్తి చేసే లక్ష్యంతో గృహ నిర్మాణశాఖ అధికారులు ఉన్నారు. ఈ బాధ్యతలను గ్రామసచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు అప్పగించారు.



దుంబ్రిగుడ మండలం కించుమండలో బద్నాయిని భీమన్న నిర్మించుకున్న కాలనీ ఇల్లు

ఒక్కొక్క ఇంటికి రూ.1.80 లక్షలు
ఒక్కొక్క ఇంటికి ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు మంజూరు చేశాయి. ఇందులో రూ.1.50 లక్షలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చెల్లిస్తున్నాయి. ఎన్ఆర్ఈజీఎస్‌లో కూలీ పనుల రూపంలో రూ.12 వేలు, బాత్‌రూం నిర్మాణానికి రూ.18 వేలు చెల్లిస్తున్నాయి. ఇంటి నిర్మాణం స్థాయినిబట్టి బిల్లుల మంజూరు ప్రక్రియ పారదర్శకంగా చేస్తున్నారు. పనులు మరింత వేగవంతానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ తరచూ గృహ నిర్మాణశాఖ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. లబ్ధిదారులు ప్రభుత్వం మంజూరు చేసిన నిధులకు అదనంగా మరికొంత జోడించి ఇళ్ల నిర్మాణం చేపట్టారు.



గూడెంకొత్తవీధి మండలం దామనాపల్లిలో వంతాల జోగేశ్వరరావు నిర్మించుకున్న పక్కాగృహం

సకాలంలో బిల్లుల చెల్లింపులు



జిల్లా వ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేశాం. గ్రామ సచివాలయాల్లోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పనుల్లో పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరుకల్లా ఎలాగైనా నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. బిల్లులు కూడా నిర్మాణ స్థాయిని బట్టి సకాలంలో మంజూరు చేస్తున్నాం.

– బాబునాయక్, ఇన్‌చార్జి పీడీ, గృహ నిర్మాణశాఖ, పాడేరు

పల్లె బాట పట్టిన పట్నం
- ఖాళీగా కూడళ్లు
- నిర్మానుష్యంగా కాలనీలు



నిర్మానుష్యంగా కాన్వెంట్ జంక్షన్



నిత్యం రద్దీగా ఉండే రామకృష్ణా జంక్షన్ ఇలా..

దాబాగార్డెన్స్ (విశాఖ): పట్టణం గ్రామం వెళ్లింది. ఆర్టీసీ కాంప్లెక్స్ ఖాళీ అయింది. నగర రోడ్లు నిర్మానుష్యంగా మారాయి. సంక్రాంతి పండగ సందర్భంగా విశాఖ మహానగరంలో నివాసముంటున్న శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, కాకినాడ, రాజమండ్రి, అమలాపురం తదితర ప్రాంతాల నుంచి వలస వచ్చిన వారు విశాఖ నుంచి వారి వారి ప్రాంతాలకు తరలి వెళ్లడంతో నగరం నిర్మానుష్యంగా మారింది. నియోజకవర్గంలో అధిక ప్రాంతాల్లో వలస వచ్చిన వారు ఉండడం.. వారంతా సంక్రాంతి పండగకు వారి సొంతూళ్లకు తరలి వెళ్లడంతో చిలకపేట, అల్లిపురం, భూపేష్‌నగర్, కల్లుపాకలు, వన్‌టౌన్‌లోని పలు ప్రాంతాలు వెలవెలబోయాయి.

సంక్రాంతి పండగ సంతోషంగా జరుపుకోవాలి
- కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి,పాడేరు: సంక్రాంతి పండగను జిల్లా ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. ఆయనతోపాటు ఎస్పీ తుహిన్‌సిన్హా, జేసీ కార్తీక్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ పీవోలు అభిషేక్, సూరజ్‌గనోరే, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, నాగులాపల్లి ధనలక్ష్మిలు వేర్వేరు ప్రకటనల్లో జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

'పీఎం జన్‌మన్' ప్రారంభ ఏర్పాట్లు పూర్తి



సాక్షి, పాడేరు: కొత్త భల్లుగుడలో పీఎం జన్‌మన్ కార్యక్రమ వేదికను, ప్రారంభ ఏర్పాట్లను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఆదివారం పరిశీలించారు.

37 బస్సులపై కేసుల నమోదు

గోపాలపట్నం (విశాఖ): సంక్రాంతి పండగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించిన 37 బస్సులపై కేసులు నమోదు చేశామని ఉప రవాణా కమిషనర్ రాజా రత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13 నుంచి ప్రైవేటు బస్సులు తనిఖీలు నిర్వహించామన్నారు. వివిధ రకాల నిబంధనలు ఉల్లంఘనలపై 37 కేసులు నమోదు చేశామని తెలిపారు. ఈ తనిఖీలు ఈ నెల 17 వరకు కొనసాగుతాయని చెప్పారు.



ప్రైవేటు బస్సును తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

సంక్రాంతి జోష్



సుంకరమెట్ట సంతలో గాజుల కొనుగోళ్లు




వేషధారణలతో సందడి చేస్తున్న బుడియాలు

- పర్యాటక ప్రాంతాలు కళకళ
- వారపు సంతల్లో భారీగా లావాదేవీలు

సాక్షి, పాడేరు: సంక్రాంతి నేపథ్యంలో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు సందర్శకులతో.. వారపు సంతలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. మన్యం అందాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. జి.మాడుగుల మండలంలోని తారుమార సంత మొదలుకుని జిల్లా కేంద్రమైన పాడేరులో జరిగిన వారపు సంత వరకు రూ.కోట్లలో లావాదేవీలు జరిగాయి.

అరకులోయ రూరల్: మండలంలోని సుంకరమెట్టలో ఆదివారం జరిగిన వారపు సంతలో భారీగా లావాదేవీలు జరిగాయి. సంక్రాంతి సామగ్రి కొనుగోలు చేసేందుకు గిరిజనులు భారీగా తరలివచ్చారు. వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను విక్రయించి పండగ సామగ్రి కొనుగోలు చేశారు. దుస్తులు, గాజులు, పసుపు, కుండల అమ్మకాలు భారీగా జరిగాయి. బుడియాలు వివిధ వేషధారణలతో డ్యాన్సులు చేస్తూ సందడి చేశారు.

దుంబ్రిగుడ: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు భారీగా తరలివచ్చారు. కుటుంబ సమేతంగా వచ్చి సందడి చేశారు. సంక్రాంతి సెలవులు నేపథ్యంలో ఇక్కడికి వచ్చే పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. చిరు వ్యాపారాలు భారీగా జరుగుతున్నాయి.



చాపరాయి ముఖ ద్వారం వద్ద పర్యాటకుల సందడి

పులకించిన సింహగిరి
వేడుకగా భోగి, సంక్రాంతి సంబరాలు



సింహగిరిపై రాజగోపురం ఎదురుగా ఏర్పాటు చేసిన భోగిమంటలో పిడకలు వేస్తున్న భక్తులు

సింహాచలం (విశాఖ) : సింహగిరిపై సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. పండగ విశిష్టతను చాటుతూ, గ్రామీణ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం అధికారులు వేడుకగాహించారు. భోగి పర్వదినాన స్వామివారిని దర్శించుకునేందుకు సింహగిరికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి దర్శనంతో పాటు సంక్రాంతి సంబరాలు కూడా ఒకే చోట చూసే భాగ్యం తమకు దక్కిందని ఆనంద భరితులయ్యారు. విశాఖ శారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి సంబరాలను ప్రారంభించారు. ఆలయ రాజగోపురం ఎదురుగా ఉన్న మాడ వీధిలో పెద్ద ఎత్తున వేసిన భోగిమంటను స్వరూపానందేంద్ర సరస్వతి వెలిగించారు. భోగి పిడకలు మంటలో వేశారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, దేవస్థానం అధికారులు, సిబ్బంది ఈకార్యక్రమంలో పాల్గొన్నారు.



స్వరూపానందేంద్ర సరస్వతికి అప్పన్న జ్ఞాపిక అందజేస్తున్న ఈవో శ్రీనివాసమూర్తి

విశేషంగా ప్రదర్శనలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా సింహగిరి మాడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గొబ్బెళ్ల ముత్యాల ముగ్గులు, చెరుకు గెడలు, ఎడ్లబండి, నాగళ్లు, గడ్డిమోపులు, రంగులు వేసిన కుండలు, గోవులు, ఎద్దులబండి, కుమ్మరి చేసే మట్టి వస్తువులను భక్తులు తిలకించారు. జంగం దేవర, కొమ్మదాసరి, హరిదాసులు సంక్రాంతి సంబరాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గంగిరెద్దు విన్యాసాలు, కోలాటం ప్రదర్శనలను భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధాన్యం గుట్టలవద్ద మహిళలు సందడి చేశారు. కుండల్లో పాలు పోసి పొంగించారు. స్వామివారి ఆలయాన్ని, సింహగిరి మాడ వీధులను విశేషంగా అలంకరించారు. రాజగోపురం వద్ద ఏర్పాటు చేసిన వరాహస్వామి ఆర్ట్ విశేషంగా ఆకట్టుకుంది.



రాజగోపురం వద్ద వరాహస్వామి అలంకరణ

ప్రజల పండగ : స్వాత్మానందేంద్ర సరస్వతి

భోగి, సంక్రాంతి, కనుమ గొప్ప పండగలని శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి అన్నారు. సింహగిరిపై సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. యావత్ భారతావనిలోనే భోగి, సంక్రాంతి, కనుమ పండగలకు ప్రత్యేకత ఉందన్నారు. సంక్రాంతి పండగ ప్రజల పండగ అన్నారు. సింహాచలం దేవస్థానంలో ఏటా సంక్రాంతి సంబరాలను పెద్ద ఎత్తున నిర్వహించడం అభినందనీ యమన్నారు.



సింహగిరిపై సంక్రాంతి అతిథులు



పులివేషాలు



కోలాటం ప్రదర్శిస్తున్న మహిళలు

ముంచంగిపుట్టులో చోరీ



ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు



అపహరణకు ప్రయత్నించిన బోరు మోటార్ ఇదే

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో స్థానిక ఫారెస్టు కార్యలయ సమీపంలో ఇంటిలో దొంగతనం జరిగింది.60 వేలు విలువ చేసే పలు రకాల వస్తువులను దొంగతనానికి గురైయ్యాయి. వివరాలు విధంగా ఉన్నాయి. ఫారెస్టు కార్యాలయం ఎదుట ఉన్న వంతాల గణేశ్వరావు ఇంట్లో శనివారం రాత్రి దొంగలు ఇంటి తలుపులు పగలు గొట్టి వ్యవసాయ పనిముట్లు, దుస్తులు, బిందెలు తదితర సామగ్రిని అపహరించుకు పోయారు. ఇంటి వద్ద ఉన్న బోరు మోటర్‌ను దొంగిలించడానికి ప్రయత్నించినా, సాధ్యం కాకపోవడంతో విడిచిపెట్టి పోయారు. గణేశ్వరరావు ఆదివారం ఇంటి వచ్చి చూసేసరికి తలుపులు తీసి ఉండడం, వస్తువులు చిందరవందరగా ఉండడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్‌ఐ రవీంద్ర దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. వివరాలు సేకరించారు. విచారణ చేస్తున్నారు.

అప్పన్నా.. అందుకోవయ్యా తొలిపంట



తలపై గుమ్మడికాయలు పెట్టుకుని స్వామికి సమర్పించేందుకు క్యూలో ఉన్న మహిళలు

స్వామికి తొలి పంటలు సమర్పించిన రైతులు

సింహాచలం: భోగి సందర్భంగా ఆదివారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని గ్రామీణ ప్రాంతాల నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామికి తొలి పంటలను కానుకగా సమర్పించారు. వరి దుబ్బులు, బియ్యం, కూరగాయలు, నూనె, పాలు, పెరుగు, వెన్న, పంచదార, పప్పు దినుసులను భక్తిశ్రద్ధలతో స్వామికి అందించారు. కరువు కాటకాలు రాకుండా ఏటా తమ పొలాలు పచ్చగా పండాలని స్వామిని వేడుకున్నారు. గ్రామీణ ప్రాంతాల భక్తులు గరిడి బృందాలతో తరలి వచ్చి అప్పన్న స్వామికి మొక్కులు చెల్లించారు. ఉదయం ఐదు గంటల నుంచి మొదలైన భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది. ఎటుచూసినా సింహగిరి భక్తజన సంద్రంగా మారింది. దర్శన క్యూలన్నీ భక్తులతో కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల నిండిపోయింది. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. కొండదిగువ పాత గోశాల నుంచి అడవివరం మార్గం, సింహగిరి ఘాట్‌రోడ్డుల్లో పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించింది. గోపాలపట్నం ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

ఇల వైకుంఠం బల్లిగిరి

కమనీయంగా గోదా రంగనాథుల కల్యాణం

అల్లిపురం : బల్లిగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం అల వైకుంఠాన్ని తలపించింది. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా భోగి పండగ సందర్భంగా దేవస్థానం కల్యాణ మండపంలో కమనీయంగా గోదారంగనాథుల కల్యాణం నిర్వహించారు. గోదాదేవి, రంగనాథులు భక్తులకు కల్యాణ మూర్తులుగా దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు గొడవర్తి వీర రాఘనాథాచార్యులు ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. గోదాదేవి రంగనాథుని కల్యాణం చేసుకునేందుకు నెల రోజుల పాటు ధనుర్మాసంలో ఆయనను స్తుతిస్తూ రచించిన తిరుప్పావై పాశురములు, వాటి విశిష్టతను భక్తులకు వివరించారు. నెలరోజుల పాటు ఆమె చేసిన పూజల ఫలితంగా సాక్షాత్తు రంగనాథుడు గోదాదేవిని కల్యాణం చేసుకున్నారని వివరించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి దేవదాయ శాఖ తరఫున గోదారంగనాథులకు పట్టువస్త్రాలు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు దేవస్థానంలో కల్యాణ విందు ఏర్పాటు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వామి, అమ్మవార్లకు దేవదాయ శాఖ తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఈవో జీవీ రమాబాయి

అలమేలు మంగ దేవాలయంలో..

స్థానిక అలమేలు మంగ దేవాలయంలో ఆదివారం సాయంత్రం గోదారంగనాథుల కల్యాణం అత్యంత వైభవంగా చేపట్టారు. ఆలయ అర్చకులు పి.కేశవాచార్యులు కల్యాణమూర్తులను విశేషంగా అలంకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో అలమేలు మంగమ్మకు, పద్మావతి అమ్మవారికి, గోదాదేవికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు.

స్వయంభూ విఘ్నేశ్వరునికి భోగి పూజలు

- ఘనంగా ప్రారంభమైన సంక్రాంతి మొదటి తీర్థం
- కిటకిటలాడిన కూరగాయల తీర్థం

చోడవరం: ఒక పక్క భోగి మంటల సందడి, మరో పక్క సంక్రాంతి తీర్థాలు ప్రారంభం కావడంతో గ్రామాల్లో హడావుడి నెలకొంది. ఆదివారం భోగి పండగ రోజు నుంచే తీర్థాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే అంతా వాడవాడలా భోగి మంటలు వేసి సందడి చేశారు. చిన్నపిల్లలకు చిక్కులు తొలగిపోవాలంటూ భోగిపండ్లు వేసి వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆదిదేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద మొదటి తీర్థం జరిగింది. భోగి పండగ పురస్కరించుకొని ఇక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి స్వామిని దర్శించుకోవడానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం ప్రాంగణమంతా కిటకిటలాడింది. ప్రత్యేక క్షీరాభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి పట్టణ పురవీధుల్లో తిరువీథోత్సవం నిర్వహించారు. అనంతరం సాయంత్రం సంక్రాంతి సందర్భంగా మొదటి తీర్థం స్వామివారి ఆలయం వద్ద జరిగింది. గ్రామీణ వాతావరణానికి అద్దం పట్టే బెలూన్లు, పిండివంటలు, పంచదార చిలుకలు అమ్మడంతో వాటిని కొనుగోలు చేసేందుకు అంతా ఆసక్తి చూపారు. రంగులరాట్నాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో కోలాహలం నెలకొంది. మొదటి తీర్థం కావడంతో పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు.



సంతలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న గ్రామస్తులు

కిక్కిరిసిన కూరగాయల తీర్థం

జిల్లాలో ఎక్కడా లేని విధంగా చోడవరం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద కూరగాయల తీర్థం సందడిగా జరిగింది. సంక్రాంతి పండగలో రైతులు పండించిన కొత్త పంటలే ముఖ్యం కావడంతో వాటిని ఇక్కడ విక్రయించారు. మెయిన్‌రోడ్డుతోపాటు ఆంధ్రాబ్యాంక్ రోడ్డు, సినిమాహాలు జంక్షన్ అన్ని ప్రదేశాలు కూరగాయల దుకాణాలతో నిండిపోయింది. వీటిని కొనుగోలు చేసి సంక్రాంతి రోజున పూజ చేస్తే మంచి జరుగుతుందని ప్రతీతి. అందుకే ఇక్కడ కూరగాయలు కొనేందుకు వేలాది మంది జనం తరలిరావడంతో రోడ్లన్నీ కిటకిటలాడాయి.

మార్కెట్లు కళకళ

జిల్లా వ్యాప్తంగా కొనుగోలుదారులతో సందడి

సాక్షి, పాడేరు: సంక్రాంతి శోభతో జిల్లాలోని మార్కెట్లు కళకళలాడుతున్నాయి. నగరంలోని ఏ మార్కెట్ చూసినా కొనుగోళ్లు, అమ్మకాలతో రద్దీగాను, సందడిగాను కనిపిస్తున్నాయి. సంక్రాంతి సందర్భంగా వినియోగదారులను ఆకట్టుకునేందుకు వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ షాపులు, షాపింగ్ మాల్స్‌లను విద్యుద్దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. వస్త్రాలు, దుస్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు ఆభరణాలు, ఇతర సరకులు కొనుగోళ్ల కోసం జనం పోటెత్తారు. ఖాతాదారులను వ్యాపార సంస్థలు ఇప్పటికే పలు ఆఫర్లు, డిస్కౌంట్లను ప్రకటించాయి. తమ వద్ద కొనుగోలు చేసిన వారికి కార్లు, బైక్‌లు, బంగారు ఆభరణాలు, గోల్డ్ కాయిన్స్ వంటివి కూడా లక్కీ డీప్ ద్వారా గెలుపొందిన వారికి ఇస్తామని పలుచోట్ల బోర్డులు పెట్టాయి. వీటికి ఆకర్షితులై అవి ఎలాంటి ఆఫర్లో ఆరా తీయడానికి కొందరు, కొనుగోళ్లకు మరి కొందరు ఎగబడ్డారు. భోగీ పండుగ రోజైన ఆదివారం నగరంలో రద్దీతో పాటు అమ్మకాలు, కొనుగోళ్లు పలు రెట్లు అధికమైంది. దీంతో వాహనాలు, కొనుగోలుదార్లతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. పోలీసులు ట్రాఫిక్‌కు ఇబ్బందుల్లేకుండా తగు చర్యలు తీసుకున్నారు.

45 రైళ్లు.. 100 ట్రిప్పులు

తాటిచెట్లపాలెం: పండగ సీజన్‌లో వాల్తేర్ డివిజన్ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు 45 ప్రత్యేక రైళ్లను 100 ట్రిప్పులుగా నడుపుతున్నట్లు చెప్పారు. ప్రయాణికుల భద్రతా దృష్ట్యా అత్యవసర సేవల నిమిత్తం అధికారులు, సిబ్బందిని సిద్ధం చేశామన్నారు. కమర్షియల్ సిబ్బంది, రైల్వే భద్రతా దళం, రైల్వే పోలీసు, సివిల్ డిఫెన్స్ బృంద సభ్యులు, బృందాలుగా ఏర్పాటు చేసి ప్రయాణికులకు అనవరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు.

పట్టుదలతోనే విజయాలు సొంతం


ఉత్తరప్రదేశ్ సీబీసీఐడీ అడిషినల్ డీజీ సత్యనారాయణ



విద్యార్థినులనుద్దేశించిన మాట్లాడుతున్న సత్యనారాయణ

మాకవరపాలెం: పట్టుదలతోనే విజయాలను సొంతం చేసుకోవచ్చని ఉత్తరప్రదేశ్ సీబీసీఐడీ అడిషినల్ డీజీ సత్యనారాయణ తెలిపారు. మండలంలోని కొండలఅగ్రహారంలో ఇమ్మానుయేలు జనరల్ ఆస్పత్రితోపాటు ఇక్కడ నర్సింగ్ కళాశాలను ఆదివారం సాయంత్రం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో వైద్య సేవలపై వైద్యులతో మాట్లాడి తెలుసుకున్నారు. సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. అనంతరం నర్సింగ్ విద్యార్థుల సమావేశంలో మాట్లాడారు. ఎక్కడ చదువుకున్నా, ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా, సమాజ సేవ చేయడంలో ముందుండాలని సూచించారు. లక్ష్య సాధనలో పట్టు వదలకుండా శ్రమించాలన్నారు. నర్సీపట్నం గ్రంథాలయంలో రూ.2 లక్షలతో పోటీ పరీక్షల మెటీరియల్‌ను అందించానని, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇమ్మానుయేల్ సంస్థ డైరెక్టర్ బిషప్ కె.జీవన్ రాయ్, గెయిల్ చీఫ్ జనరల్ మేనేజర్ సంజీవరావు, జ్యోతీబా పూలే ఆలిండియా ఓబీసీ సంఘం అధ్యక్షుడు పోతల ప్రసాద్ పాల్గొన్నారు.

కొమిరలో బయటపడిన సొరంగం



లోతుగా ఉన్న సొరంగం పై భాగం

రావికమతం: మండలంలోని కొమిర గ్రామంలో ఊర మెట్ట సమీపంలో సొరంగం బయట పడింది. దీంతో గ్రామస్తులు, చుట్టు పక్కల గ్రామాల వారు చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సర్పంచ్ గొర్లె రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఇక్కడ ఇంటింటి కుళాయిల ఏర్పాటుకు పైపులైన్ పనులు చేస్తుండగా, ఒక్క సారిగా భూమి లోపలికి మట్టి పోతుండటంతో జేసీబీ ఆపరేటర్‌కు అనుమానం వచ్చింది. వెంటనే ఆ భాగంలో అడ్డంగా ఉన్న రాయిని తొలగించగా లోతైన గొయ్యి, దాని కింద భాగంలో తూర్పు వైపునకు మలుపు తిరిగినట్టుగా సొరంగం కనిపించింది. దీంతో పొడవైన తాడు సహాయంతో ఒక కూలీని దింపగా 20 అడుగుల వరకు వెళ్లి ఆపై చీకటిగా ఉండటంతో భయంతో వెనక్కి వచ్చేశాడు. గ్రామ సర్పంచ్ ఈ విషయాన్ని ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావుకు, ఉన్నతాధికారులకు తెలియజేశారు.

మరో ముగ్గురికి కరోనా

మహారాణిపేట: విశాఖలో ముగ్గురికి కరోనా సోకింది. గడిచిన 24 గంటల్లో 52 మందికి పరీక్షలు చేయగా.. వీరిలో ముగ్గురికి కరోనా నిర్ధారణ జరిగింది. 10 మంది హోమ్ ఐసోలేషన్‌లో, ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని డీఎంహెచ్‌వో పి.జగదీశ్వరరావు తెలిపారు.